సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 3 । ఫిబ్రవరి । 2024



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నారసింహ సుదర్శన హోమానికి మద్దినేని రామకిషన్, లక్ష్మి దంపతులు (విజయవాడ) రూ.లక్ష విరాళం అందజేశారు.




జన గోదావరి సిద్ధం

8లో

వైఎస్సార్ సీపీ 'సిద్ధం' బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏలూరు వేదికగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించనున్నారు.

డెల్టాలకు 9,100 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 9,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,600, మధ్య డెల్టాకు 2,000, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.50 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేడు దెందులూరులో 'సిద్ధం' సభ

- పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపు



రాజమహేంద్రవరం సిటీ: ఏలూరు జిల్లా దెందులూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం నిర్వహిస్తున్న సిద్ధం బహిరంగ సభకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. తాడితోటలోని సంహిత కన్వెన్షన్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికలకు వైఎస్సార్ సీపీ శ్రేణులను సమాయత్తం చేయడానికి సిద్ధం కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో సీఎం జగన్ భారీ బహిరంగ సభలు నిర్వహిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా శనివారం దెందులూరులో ఉభయ గోదావరి జిల్లాలకు సంబంధించిన భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. దీనికి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచీ ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని రాజా కోరారు.

జిల్లాలో 1,569 పోలింగ్ కేంద్రాలు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా 1,569 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఎన్నికల నిర్వహణ ముందస్తు ఏర్పాట్లు, తుది ఓటర్ల జాబితా తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2014, 2019 ఎన్నికల సందర్భంగా గుర్తించిన సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు తదితర సౌకర్యాల కల్పనపై ఇప్పటికే ఈఆర్‌ఓలకు సూచనలు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 18 – 19 మధ్య వయసున్న వారు 47,333 మంది ఉన్నట్టు అంచనా వేయగా, ఇప్పటి వరకూ 37,200 మందికి ఓటు హక్కు కల్పించామని తెలిపారు. అనపర్తి ఈఆర్‌ఓగా ఎం.మాధురి విధుల్లో చేరారని, నిడదవోలు ఈఆర్‌వో రమణా నాయక్ ఇంకా చేరాల్సి ఉందని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, డీఆర్‌ఓ జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఓబీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

ఆర్‌ఓబీ నిర్మాణానికి శ్రీకారం

- నిడదవోలులో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు భూమి పూజ
- ఏడాదిన్నరలో పూర్తి చేస్తామన్న అధికారులు

నిడదవోలు: ఉభయ గోదావరి జిల్లాల ప్రజల చిరకాల స్వప్నం నిడదవోలు రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. పట్టణంలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ఆర్‌ఓబీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ఈ ఆర్‌ఓబీని గత టీడీపీ పాలకులు కాగితాలకే పరిమితం చేశారే తప్ప ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో సరిగ్గా పిల్లర్లు కూడా నిర్మించలేని చిన్న కాంట్రాక్టర్‌ను తీసుకువచ్చి హడావుడి చేశారన్నారు. కనీసం మట్టి నమూనాలు కూడా సేకరించలేదని చెప్పారు. ఆర్‌ఓబీ నిర్మాణానికి నిడదవోలు పట్టణంతో పాటు సమిశ్రగూడెం గ్రామంలో స్థలాలు, నిర్మాణాలు కోల్పోయిన వారికి రూ.10.60 కోట్ల పరిహారం అందజేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సేతుబంధన్ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 9 ఆర్‌ఓబీలకు రూ.532 కోట్లు మంజూరైతే, దీనిలో ఒక్క నిడదవోలు ఆర్‌ఓబీకే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.184.74 కోట్లు కేటాయించారని కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో గాంధీ బొమ్మ సెంటర్, బస్టాండ్ సెంటర్, తాడేపల్లిగూడెం వైపు, పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ మీదుగా సమిశ్రగూడెం వైపు మొత్తం నాలుగు ఆర్మ్‌లుగా ఈ ఆర్‌ఓబీ నిర్మాణం జరుగుతోందని వివరించారు.

పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో ఎటువంటి పిల్లర్లూ లేకుండా 60 మీటర్ల పొడవునా ఆర్మ్ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. భవిష్యత్తులో పడవలు, నావలు వెళ్లడానికి వీలుగా కాలువపై 7 మీటర్ల ఎత్తున నిర్మించాల్సి ఉందని అన్నారు. దీంతో ప్రాజెక్టు వ్యయం ఎంతో పెరిగిందని ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు చెప్పారు. ఈ ఆర్‌ఓబీని ఏడాదిన్నర సమయంలో పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జి.జాన్‌మోషే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఆర్‌అండ్‌బీ ఈఈ దేవేంద్రరాజు, డీఈఈ డి.వెంకటరమణ ఏఈ శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు ముంగండి కృపానందం, అయినీడి పల్లారావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముళ్ళపూడి శ్రీనివాస్ చౌదరి, ఎంపీపీ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ 100%

- ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రభుత్వం అడుగులు
- 'జయీభవ సంకల్ప' పేరిట ప్రత్యేక కార్యక్రమం
- సబ్జెక్టుల వారీగా మెరుగైన శిక్షణ
- విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచి, పరీక్షలకు సిద్ధం చేయడమే లక్ష్యం
- ఇప్పటికే ప్రారంభమైన ప్రక్రియ
- 29 వరకూ కొనసాగింపు



జిల్లాలో జూనియర్ కళాశాలలు	127
ప్రభుత్వ	16
హైస్కూల్ ప్లస్	16
సోషల్ వెల్ఫేర్	5
ఎయిడెడ్	2
ప్రైవేటు	88
పరీక్ష కేంద్రాలు	52
పరీక్షలు రాయనున్న విద్యార్థులు	41,382
వీరిలో ఫస్టియర్	21,366
సెకండియర్	20,016

సాక్షి, రాజమహేంద్రవరం: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా ఇంటర్ బోర్డు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. పరీక్షలపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి, ఆత్మవిశ్వాసం పెంచి, పరీక్షలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం చేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 'జయీభవ సంకల్ప' పేరుతో ప్రత్యేక తర్ఫీదు అందిస్తోంది. వచ్చే నెలలో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గత ఏడాది 69 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. దీనిని ఈసారి 100కు పెంచాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జయీభవ సంకల్ప ప్రత్యేక కార్యక్రమం పూర్తయ్యేలోగా ప్రతి విద్యార్థీ పరీక్షలకు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

'జయీభవ సంకల్ప' లక్ష్యమిదీ..

ప్రభుత్వ జూనియర్, సాంఘిక సంక్షేమ కళాశాలలు, స్కూల్ ప్లస్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ(కేజీబీవీ)ల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే లక్ష్యంతో 'జయీభవ సంకల్ప' కార్యక్రమం రూపొందించారు. దీనిలో భాగంగా ప్రతి సబ్జెక్టు రివిజన్ చేయడంతో పాటు అత్యంత ప్రాముఖ్యమైన ప్రశ్నలపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. శిక్షణలో విద్యార్థుల ప్రతిభపై ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తూ పరీక్షలపై భయాన్ని పోగొడుతున్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా టైంటేబుల్ రూపొందించుకుని మరీ సబ్జెక్టుల వారీగా ఉదయం, మధ్యాహ్నం మెరుగైన బోధన, శిక్షణ అందిస్తున్నారు. గత ఏడాది ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ నెల 29వ తేదీ వరకూ 50 రోజుల పాటు కొనసాగనుంది.

5వ తేదీ నుంచి ప్రాక్టికల్స్

ఇంటర్ ఒకేషనల్, రెగ్యులర్ కోర్సులకు సంబంధించి ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకూ ఒకేషనల్ కోర్సులకు మూడు దశల్లో ప్రాక్టికల్ నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ పరీక్షలు జరుగుతాయి. జనరల్ కోర్సులకు సంబంధించి ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు 11 నుంచి 20వ తేదీ వరకూ ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకూ ఈ పరీక్షలు జరుగుతాయి.

ఆ పరీక్షలు తప్పనిసరి

ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నైతికత, మానవ విలువలపై పరీక్ష నిర్వహించారు. అలాగే పర్యావరణ విద్యపై శనివారం పరీక్ష నిర్వహించనున్నారు. ఈ రెండు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే ఇంటర్ పాసైనట్టు ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. గతంలో ఈ పరీక్షలు రాయని విద్యార్థులకు ప్రస్తుతం రాసే వెసులుబాటు కల్పించారు.

వచ్చే నెల 1 నుంచి ఇంటర్ పరీక్షలు

ఇంటర్ పరీక్షలు మార్చి 1 నుంచి 19వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ఈ పరీక్షలు జరుగుతాయి. మార్చి 1, 4, 6, 9, 12, 14, 16, 19 తేదీల్లో మొదటి, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ఇంగ్లిష్, మ్యాథ్స్, బోటనీ, జువాలజీ, హిస్టరీ, సివిక్స్, ఫిజిక్స్, ఎకానమీ, కెమిస్ట్రీ, కామర్స్, జాగ్రఫీ తదితర పరీక్షలు జరుగుతాయి.

'జయీభవ'తో సత్ఫలితాలు



విద్యార్థుల్లో పరీక్షలపై ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు అమలు చేస్తున్న జయీభవ సంకల్ప కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తర్ఫీదు ఇస్తుండటంతో పాఠ్యాంశాలు సులువుగా అర్థం చేసుకుంటున్నారు.

– శారద, రీజినల్ జాయింట్ డైరెక్టర్, ఇంటర్ బోర్డు, రాజమహేంద్రవరం

అడవికి చేరిన పులి



గోపాలపురం మండలం కరగపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో ఏర్పాటు చేసిన కెమెరా



కరగపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో పులి పాదముద్రలను పరిశీలిస్తున్న టైగర్ టీం అధికారులు

దేవరపల్లి: మెట్ట ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా వణికించిన పెద్దపులి ఎట్టకేలకు దేవరపల్లి, గోపాలపురం మండలాలు దాటి కరగపాడు రిజర్వ్ ఫారెస్టుకు చేరింది. అటవీ శాఖ అధికారులు ఈ విషయం వెల్లడించారు. పులి పాదముద్రలను అనుసరిస్తున్న టైగర్ టీం దాని జాడలను పసిగట్టేందుకు అటవీ ప్రాంతంలో శుక్రవారం కెమెరాలు అమర్చింది. ఆ పులి కరగపాడు అటవీ ప్రాంతం మీదుగా పాపికొండలు అభయారణ్యంలోకి చేరుతుందని భావిస్తున్నట్టు రాజమహేంద్రవరం అటవీ రేంజ్ అధికారి ఎల్.ధనరాజు తెలిపారు. సాయంత్రం 5 గంటలు దాటిన తర్వాత చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇంటికే పరిమితమవ్వాలని ఆయన హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం ఉదయం పొలాలకు వెళ్లిన దేవరపల్లి, గోపాలపురం మండలాల రైతులకు ఎక్కడా పులి పాద ముద్రలు కనిపించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆపరేషన్ టైగర్‌లో ఏలూరు, జంగారెడ్డిగూడెం సబ్ డీఎఫ్‌ఓలు, పోలవరం రేంజ్ అధికారి దావీదురాజు, డీవైఆర్‌ఓ వేణుగోపాల్, ఎఫ్‌బీఓలు కార్తీక్, శ్రీశైలం, టైగర్ టీం అధికారులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం లోక్‌సభ సమన్వయకర్తగా డాక్టర్ గూడూరి



డాక్టర్ గూడూరి శ్రీనివాస్

సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సమతూకానికి మరోసారి పెద్ద పీట వేశారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ, రూరల్ సమన్వయకర్తలుగా బీసీలకు అవకాశం కల్పిస్తామని గతంలోనే ప్రకటించిన ఆయన ఆ మాటను ఇప్పటికే నిలబెట్టుకున్నారు. వైఎస్సార్ సీపీ సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను, రూరల్‌కు బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను నియమించిన విషయం తెలిసిందే. తాజాగా బీసీ (శెట్టిబలిజ) వర్గానికి చెందిన ప్రముఖ శ్వాసకోస వైద్య నిపుణులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను రాజమహేంద్రవరం లోక్‌సభ సమన్వయకర్తగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు వెలువరించింది. డాక్టర్ గూడూరి పల్మనాలజిస్ట్‌గా జిల్లాలో ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. వైద్య రంగంలో ఆయన చేసిన సేవలను గుర్తించిన సీఎం జగన్.. గతంలో రాజమహేంద్రవరం సిటీ సమన్వయకర్తగా నియమించారు. అనంతరం ఆ పదవిని ఎంపీ భరత్‌కు కేటాయించడంతో.. డాక్టర్ గూడూరికి లోక్‌సభ సమన్వయకర్త బాధ్యతలు అప్పగించారు. తనపై నమ్మకం ఉంచి, లోక్‌సభ సమన్వయకర్తగా ఎంపిక చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలతో సమన్వయంతో వ్యవహరించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. తన ఎంపికకు సహకరించిన పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ పి.మిథున్‌రెడ్డి, ఎంపీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీరాజ్ ఈఈగా అలీముల్లా

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా మహమ్మద్ అలీముల్లా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అమరావతి సీఆర్‌డీఏ ఈఈగా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పంచాయతీరాజ్ ఈఈగా పని చేసిన ఏబీ వరప్రసాదరావు ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం అలీముల్లా కలెక్టర్ కె.మాధవీలతను మర్యాదపూర్వకంగా కలిశారు.

శివరాత్రి ఏర్పాట్లపై 5న సమావేశం

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు భక్తులతో సమావేశం నిర్వహిస్తున్నారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు శుక్రవారం ఈ విషయం తెలిపారు. మార్చి 6 నుంచి 11వ తేదీ వరకూ జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణం, రథోత్సవం, శ్రీపుష్పయాగం జరుగుతాయని వివరించారు.

కోట.. ప్రగతి బాట

- దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం
- స్కూళ్లు, ఆసుపత్రులకు కొత్త రూపు
- రూ.కోట్లతో రోడ్ల నిర్మాణం
- మౌలిక సౌకర్యాల కల్పనకు పెద్దపీట
- రెండు దశాబ్దాల పాటు తాగునీటి సమస్య లేకుండా చర్యలు

సుందరంగా నిర్మించిన జగనన్న కాలనీ



సామర్లకోట: కాకినాడ జిల్లాలో ప్రధాన పట్టణంగా, ముఖ్య రైల్వే జంక్షన్‌గా, పరిశ్రమలకు నెలవుగా పేరొందిన సామర్లకోట ప్రగతి దిశగా పరుగులు తీస్తోంది. గత టీడీపీ పాలకుల మాదిరిగా ఆర్భాటాలు లేవు.. గోరంత కూడా చేయకపోయినా కొండంత చేసేసినట్టు గొప్పలు చెప్పుకోవడాల్లేవ్.. గత పాలకులు నాడు నిర్లక్ష్యం చేసిన ప్రతి రంగంలోనూ నేడు ప్రగతి సుమాలు విరబూస్తున్నాయి.

నాడు.. నేడు.. తేడా చూడు

- మున్సిపాలిటీ పరిధిలో నాడు–నేడు పథకం రెండు విడతల్లో 24 పాఠశాలలను రూ.11.07 కోట్లతో అభివృద్ధి చేశారు. నాడు–నేడు పథకం ప్రారంభం కాక ముందు మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో 3,324 మంది విద్యార్థులుండగా, ఇప్పుడు ఆ సంఖ్య 3,429కు పెరిగింది. ఎనిమిదో తరగతి విద్యార్థులు 980 మందికి రెండు విడతల్లో ట్యాబ్‌లు పంపిణీ చేశారు.
- మున్సిపల్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రూ.2 కోట్లతో 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేశారు. స్కానింగ్, దంత వైద్య పరికరాలు, ఫిజియోథెరపీ, సర్జికల్, అత్యవసర విభాగం, గర్భిణులు, పురుషులకు విడివిడిగా బెడ్లు, 108, 104 వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. టీడీపీ పాలనలో ఇక్కడ ఇద్దరు డాక్టర్లు మాత్రమే ఉండగా ప్రస్తుతం వారి సంఖ్యను 8కి పెంచారు. ఆరోగ్యశ్రీ సిబ్బందితో పాటు వివిధ విభాగాల్లో గతంలో 10 మంది సిబ్బంది ఉండగా ప్రస్తుతం పూర్తి స్థాయిలో 40 మందిని నియమించారు. ఫలితంగా గతంలో రోజుకు 60 నుంచి 70 ఉండే ఓపీ ప్రస్తుతం 150 నుంచి 200కు పెరిగింది. రాత్రి సమయంలో కూడా వైద్యం అందుతోంది. కుక్క, పాము కాట్ల మందులు కూడా అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి ఇన్‌చార్జి అమల తెలిపారు.

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం

- స్థానిక సత్యనారాయణపురం నుంచి ఎఫ్‌సీఐకి వెళ్లే రోడ్డు సుమారు 15 ఏళ్లుగా గోతులతో బురదమయంగా ఉండేది. గతంలో పెద్దాపురం ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి విజయం సాధించి డిప్యూటీ సీఎం, హోం మంత్రిగా పదవి పొందిన నిమ్మకాయల చినరాజప్ప ఎఫ్‌సీఐ రోడ్డుతో పాటు, అమ్మాణమ్మ అపార్టుమెంట్లకు రోడ్లు వేయిస్తానని హామీలు ఇచ్చారు. కానీ, ఏరు దాటాక తెప్ప తగలేసినట్టు.. ఎన్నికల్లో గెలిచాక.. ఇచ్చిన హామీలు గాలికొదిలేశారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినా పెద్దాపురంలో తిరిగి టీడీపీ నుంచి రాజప్పే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయినప్పటికీ ఈ రోడ్ల సంగతి పట్టించుకోలేదు. అంతలోనే.. జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సామర్లకోట పట్టణంలోని 31 వార్డులకు 29 వార్డుల్లో వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించడంతో మున్సిపాలిటీ అభివృద్ధిపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా రూ.1.10 కోట్లతో ఎఫ్‌సీఐ రోడ్డు, రూ.1.50 కోట్లతో అమ్మాణమ్మ అపార్టుమెంట్ రోడ్లను నిర్మించింది.
- గత టీడీపీ పాలనలో నీలమ్మ చెరువును అభివృద్ధి చేస్తామంటూ ప్రకటించి, షరా మామూలుగానే గాలికొదిలేశారు. ఈ పనులను కూడా రూ.కోటితో వైఎస్సార్ సీపీ హయాంలోనే చేస్తున్నారు.

ఇవిగో ప్రగతి కాంతులు

- కోట్లమ్మ చెరువును అభివృద్ధి చేస్తామని గత పాలకులు ఇచ్చిన హామీలు హామీలుగానే మిగిలిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం అమృతధార నిధులు రూ.1.10 కోట్లు మంజూరు చేయడంతో ప్రస్తుతం ఈ చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.
- పట్టణ ప్రజలందరికీ తాగునీరు అందించే విధంగా ప్రభుత్వం రూ.26 కోట్లు విడుదల చేసింది.
- 14, 15 ఆర్థిక సంఘాల నిధులు కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైన్లు నిర్మించారు.
- ఇలా మరెన్నో అభివృద్ధి పనులు పట్టణంలో జరిగాయి.. జరుగుతున్నాయి.

2,444 మందికి ఇళ్ల స్థలాలు

మున్సిపల్ పరిధిలో 55 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్‌లో 2,444 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. వారిలో ఇప్పటి వరకూ 1,500 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. కిర్లంపూడి రోడ్డుకు ఇరువైపులా ఉన్న జగనన్న లే అవుట్‌లో 11 పార్కులు ఏర్పాటు చేశారు. రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, ఒక పాఠశాల, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. రోడ్లు, తాగునీరు, డ్రైన్లు, విద్యుత్తు సబ్ స్టేషన్ నిర్మాణంతో పాటు ఇళ్ల నిర్మించుకునే వారికి ఆర్థిక సహాయంతో కలిపి సుమారు రూ.50 కోట్లు ఖర్చు చేశారు.

క్లుప్తంగా

అండర్-17 రాష్ట్ర బాలికల క్రికెట్ పోటీల్లో విజేత తూర్పుగోదావరి



ట్రోఫీని అందుకుంటున్న తూర్పుగోదావరి జిల్లా జట్టు

రాజమహేంద్రవరం రూరల్: నరసారావుపేటలో డీఎస్ఏ స్టేడియంలో జనవరి 29 నుంచి 31వ తేదీ వరకు జరిగిన 67వ స్కూల్‌గేమ్స్ అండర్-17 రాష్ట్రబాలికల క్రికెట్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జట్టు విజేతగా నిలిచింది. 13 జిల్లాలు పాల్గొన్న ఈ పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం జిల్లా జట్టుపై గెలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. జట్టులోని వీరా విద్యశ్రీ (కాకినాడ), జి.వరిష్మా, సలేహా, సత్యప్రియాంక (రాజమహేంద్రవరం) జాతీయస్థాయి జట్టుకు ఎంపికయ్యారని క్రికెట్ కోచ్ తోటరవి తెలిపారు. టోర్నమెంట్ అబ్జర్వర్ నాగకుమార్, మేనేజర్లు టి.విఘ్నేశ్వరుడు, వి.నాగదుర్గ పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో చిన్నారికి గాయాలు

రంగంపేట: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో శుక్రవారం చిన్నారిపై పిచ్చికుక్క దాడి చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శీలం శ్రీను ఏడాది కుమారుడు హర్షవర్ధన్ ఇంట్లో ఆడుకుంటున్న సమయంలో పిచ్చి కుక్క దాడి చేసింది. ఈ దాడిలో చిన్నారికి ముఖంపై తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు.

8వ తేదీలోగా ఆధారాలు పంపాలి

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాల నియామకం-2022-23లో ప్రకటించిన గ్రూప్-4, గ్రూప్-4 పరిధిలోకి రాని పోస్టులకు సంబంధించి తాత్కాలిక, అనర్హుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు విభిన్న ప్రతిభావంతుల సహాయక సంచాలకులు పి.నారాయణమూర్తి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రకటించిన లిస్టులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8వ తేదీ సాయంత్రం లోపు స్వయంగా గాని, వ్యక్తి ద్వారా గాని లిఖితపూర్వకంగా తగిన ఆధారాలను జత చేసి సహాయ సంచాలకులు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయో వృద్ధుల సంక్షేమశాఖ, కాకినాడ వారికి అందజేయాలన్నారు. మెరిట్ జాబితా తయారు చేసి 1:2 రేషియో ప్రకారం విభిన్న ప్రతిభావంతుల ధృవపత్రాలు తనిఖీ చేసిన అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

జన గోదావరి సిద్ధం



దెందులూరు సమీపాన ముస్తాబయిన సభా వేదిక



ఫ్యాన్ గుర్తులో ఫ్లెక్సీ

వైఎస్సార్ సీపీ 'సిద్ధం' బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏలూరు వేదికగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. 50 నియోజకవర్గాల నుంచి లక్షలాది మంది నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు తరలిరానున్నారు. ఏలూరు ఆటోనగర్-దెందులూరు సమీపంలోని 110 ఎకరాల సహారా గ్రౌండ్స్‌లో సభా ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- సభకు పూర్తయిన ఏర్పాట్లు
- నేడు ఏలూరులో సీఎం జగన్ ఎన్నికల శంఖారావం
- 110 ఎకరాల్లో సభా ప్రాంగణం ముస్తాబు
- 50 నియోజకవర్గాల నుంచి లక్షలాది మంది కేడర్ రాక
- 7 ప్రాంతాల్లోని 150 ఎకరాల్లో పార్కింగ్ కేంద్రాలు
- 3,298 మంది పోలీసులతో భారీ బందోబస్తు

సాక్షి ప్రతినిధి,ఏలూరు: జన జాతరకు.. జన గోదావరి సిద్ధమైంది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు 'సిద్ధం' సభా వేదికగా శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేయనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలో 19, ఉమ్మడి పశ్చిమగోదావరిలో 15, ఉమ్మడి కృష్ణా జిల్లాలో 16 నియోజకవర్గాలు మొత్తం 50 నియోజకవర్గాల నుంచి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎంపీలు, ముఖ్యనేతలతో పాటు పార్టీ కార్యకర్తలు, పోలింగ్ బూత్ కమిటీ సభ్యులు, ప్రజలు లక్షలాది మంది సభకు తరలిరానున్నారు. ఏలూరు ఆటోనగర్-దెందులూరు సమీపంలోని సహారా గ్రౌండ్స్‌లో 110 ఎకరాల ప్రాంగణాన్ని బహిరంగ సభ కోసం ముస్తాబు చేస్తున్నారు. ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. పదుల సంఖ్యలో గ్యాలరీలు, సిట్టింగ్ ఏర్పాట్లు చేశారు. సభా వేదిక నిర్మాణం, వేదిక ముందు భాగంలో 'ఫ్యాన్' గుర్తులో వాకింగ్‌వే ఏర్పాటుచేశారు. ప్రతి గ్యాలరీలో మంచినీరు, మజ్జిగ అందించేలా ఏర్పాట్లతో పాటు వైద్యసేవలు కూడా అందుబాటులో ఉంచారు. సభా ప్రాంగణం చుట్టూ ఏర్పాటుచేసిన పార్టీ ఫ్లెక్సీలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అలాగే మేం సిద్ధం' అంటూ పార్టీ శ్రేణులు భారీగా ఫ్లెక్సీలతో ప్రాంగణాన్ని నింపేశారు. పదుల సంఖ్యలో సీఎం జగన్ భారీ కటౌట్‌లను స్థానిక నేతలు ఏర్పాటు చేస్తున్నారు. సభా ప్రాంగణంలో 15కు పైగా భారీగా ఎల్‌ఈడీ స్క్రీన్‌లను కూడా ఏర్పాటుచేశారు. సభా ప్రాంగణం వెనుక భాగంలో హెలీప్యాడ్ సిద్ధమైంది.



ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతిలతో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ మిథున్‌రెడ్డి, తలశిల

అధికార యంత్రాంగం, పోలీసులు శుక్రవారం సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్‌ను నిర్వహించారు. పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎమ్మెల్యేలు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కొఠారు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ కవ్వురు శ్రీనివాస్, పార్టీ ముఖ్య నేతలు సభా ఏర్పాట్లను పరిశీలించారు.

ముఖ్యమంత్రి టూర్ షెడ్యూల్

- మధ్యాహ్నం 3.20 గంటలకు దెందులూరులోని హెలీప్యాడ్‌కు సీఎం జగన్ చేరుకుంటారు.
- 3.25 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 3.30 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు.
- 3.30 గంటల నుంచి 4.45 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.
- 4.50 గంటలకు అక్కడ నుంచి తిరుగు ప్రయాణమవుతారు.
- 4.55 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- సాయంత్రం 5 గంటలకు హెలీప్యాడ్ నుంచి తాడేపల్లికి తిరుగు పయనమవుతారు.

భారీ బందోబస్తు

ఏలూరు టౌన్: సిద్ధం బహిరంగ సభకు భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి తెలిపారు. సభా ప్రాంగణం వద్ద శుక్రవారం పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సభకు లక్షలాది మంది రానున్నారని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏలూరు జాతీయ రహదారి పక్కన సభ నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. మొత్తం 3,298 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది సేవలను వినియోగిస్తున్నామన్నారు. అదనపు ఎస్పీలు-7, డీఎస్పీలు-23, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు-78, ఆర్ఎస్సైలు-197, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలు-478, కానిస్టేబుళ్లు-1,119, మహిళా కానిస్టేబుళ్లు-199, హోంగార్డులు-80, మహిళా హోంగార్డులు-60, ఏఆర్ సిబ్బంది -167, స్పెషల్ పార్టీ సిబ్బంది-164 మందితో పాటు అదనంగా మరికొందరిని రిజర్వులో ఉంచామన్నారు. ఏఎస్పీ స్వరూపరాణి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

కనీవినీ ఎరుగని రీతిలో

కోస్తాంధ్రలో గతంలో ఎన్నడూ జరగని రీతిలో పార్టీ కేడర్‌తో జరిగే అతిపెద్ద బహిరంగ సభలో సీఎం జగన్ పాల్గొంటారు. 50 నియోజకవర్గాల ఇన్‌చార్జులకు రూట్‌మ్యాప్, పార్కింగ్ వివరాలను పంపి నియోజకవర్గాల వారీగా ఆయా పార్కింగ్ కేంద్రాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణంలో బందోబస్తు ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి పరిశీలించారు.

ఏలూరు ముస్తాబు

సభా ప్రాంగణంతో పాటు ఏలూరు నగరం, దెందులూరు జాతీయ రహదారి 'సిద్ధం' సభకు ముస్తాబైంది. వైఎస్సార్‌సీపీ జెండాలు, పార్టీ ఫ్లెక్సీలు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌లను భారీగా ఏర్పాటు చేయడంతో రాజకీయ సందడి వాతావరణం నెలకొంది.

మా కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంది



కిరాణా వ్యాపారం చేస్తున్న చిట్టెమ్మ

కొత్తపల్లి: నా భర్త వేటకు వెళితేగాని పూట గడవని పరిస్థితి. మాది పేద కుటుంబం. మాకు ఇద్దరు కుమారులు. వారిద్దరికీ వివాహం జరిగింది. నా భర్త సముద్రంలో వేటకు వెళుతుంటాడు. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. మా కుటుంబాన్ని వేట భృతితోనే పోషిస్తాడు. కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్ కాలనీ-2లో చిన్న టిఫిన్, కిరాణా దుకాణం పెట్టుకున్నాను. పెట్టుబడి లేకపోవడంతో వ్యాపారం అంతంత మాత్రంగానే ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ ఆసరా కింద నాలుగు విడతలుగా రూ.10,800, జగనన్న చేయూత కింద రూ.75,000 అందించడంతో ఆర్థికంగా నిలబడ్డాం. నా భర్తకు 60 ఏళ్లు పూర్తి కావడంతో వృద్ధాప్య పింఛనుతో పాటు వేట నిషేధ సమయంలో రూ.10వేల మత్స్యకార భరోసా కూడా వస్తోంది. ఇంటి స్థలం పట్టా ఇవ్వడంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు రుణం కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. గత ప్రభుత్వంలో మాటలు చెప్పడమే తప్ప చేసింది ఏమీలేదు. ఈ ప్రభుత్వం మా కుటుంబంలో వెలుగులు నింపింది.

– కారే చిట్టెమ్మ, ఉప్పాడ నాయకర్ కాలనీ-2, కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా



కుటుంబ పోషణ భారం తగ్గింది



ఉప్పలగుప్తం: మాది డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లి గ్రామం. నా పేరు బొక్కా దుర్గావతి. మాది చిన్న తరహా వ్యవసాయ కుటుంబం. నాకు 2019 ఎన్నికల నాటికి రూ.49,332 అప్పు ఉంది. దానిని విడతకు రూ.12,333 చొప్పున నాలుగు విడతలుగా నాకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించింది. దాంతో నేను ఒక పాడి గేదెను కొనుగోలు చేసుకుని పాలు అమ్ముకుంటున్నాను. ఆ ఆదాయంతో మా కుటుంబ పోషణ భారం తగ్గింది. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు పాదయాత్రలో రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి నాలుగు విడతలుగా రుణమాఫీ చేయడం చాలా సంతోషకరం. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– బొక్కా దుర్గావతి, శాంతి డ్వాక్రా గ్రూపు, సన్నవిల్లి గ్రామం, ఉప్పలగుప్తం మండలం, అంబేద్కర్ కోనసీమ జిల్లా.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఏపీ జట్టు ఎంపిక



ఎంపికైన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాకారిణులతో రామచంద్రపురం మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి, చక్రవర్తి తదితరులు

రామచంద్రపురం: భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీలో ఆదివారం నుంచి జరిగే 73వ జాతీయ స్థాయి జూనియర్ మహిళల బాస్కెట్‌బాల్ పోటీలకు 12 మందిని ఎంపిక చేసినట్లు రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. గత నెల 18 నుంచి శుక్రవారం వరకు ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన అనంతరం క్రీడాకారుల ఎంపికను చక్రవర్తి ప్రకటించారు. జట్టుకు కోచ్‌గా పి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కోచ్‌గా దుర్గాశ్రీనివాసరావు, మేనేజర్‌గా ఇ.కుసుమకుమారి వ్యవహరిస్తారని తెలిపారు.

ఎంపికైన జట్టు

జి.నాగదేవి -ఏలూరు, ఆర్.మహతి - పాలకొల్లు, పి.నాగవినయశ్రీ, - ఏలూరు, టి.జ్యోతి - ఏలూరు, కె.జ్ఞానదీపిక - రామచంద్రపురం, ఎ.ట్యాలీ అనిత - ఏలూరు, కె.హాసిని - కర్నూలు, పి.ప్రభుదీపిక - నూజివీడు, ఎం.గౌతమీ - విశాఖ, టి.సంజాన - చిత్తూరు, ఎం.లిఖిత - అనంతపురం, డి.అమూల్య - నరసారావుపేట

అగ్నిపథ్ స్కీమ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: అగ్నిపథ్ స్కీమ్ కింద భారత వైమానిక దళంలో అగ్నివీర్ వాయు ఇన్ టేక్ 1/2005 ద్వారా కాడెట్ నియామక పరీక్షకు హాజరయ్యేందుకు ఆసక్తి కలిగిన అర్హులైన అవివాహిత యువతీ, యువకులు ఈ నెల 6వ తేదీ రాత్రి 11 గంటలలోపు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. ఈ నియామకాలకు ఆన్‌లైన్ పరీక్షలు 2024 మార్చి 17వ తేదీ నుంచి జరుగుతాయన్నారు. 2004 జనవరి 2వ తేదీ నుంచి 2007 జనవరి 2వతేదీ మధ్య జన్మించిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్హతలు, రిజిస్ట్రేషన్, పరీక్ష, రుసుము తదితర పూర్తి వివరాలను వెబ్‌పోర్టల్ నుంచి పొంది ఈ నెల 6వతేదీ రాత్రి 11 గంటల లోపు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చని 12 ఎయిర్ మెన్ సెలెక్షన్ సెంటర్, సికింద్రాబాద్ వారు ప్రకటన జారీ చేసినట్లు కలెక్టర్ కృతికా శుక్లా కోరారు.

ప్రశాంతంగా పరీక్ష

కంబాలచెరువు (రాజమహేంద్రవరం) : నైతికత, మానవీయ విలువలపై ఇంటర్ విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. తూర్పుగోదావరి జిల్లాలో 21,363 మందికి 21,195 మంది హాజరయ్యారు. కాకినాడ జిల్లాలో 22,092 మందికి 21,971, కోనసీమలో 13,936 మందికి 13,686 మంది రాశారు. శనివారం జరగాల్సిన పర్యావరణ విద్య పరీక్ష ఈనెల 23కు వాయిదా పడిందని ఆర్ఐఓ నరసింహం తెలిపారు.

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

వలు శాఖలపై చర్చించనున్న సభ్యులు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారుతున్నాయి. తాగునీటి సమస్యల పరిష్కారం, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, పారిశుధ్యం మెరుగు తదితర మౌలిక వసతుల కల్పన జరిగింది. ఇంటి ముంగిటకే వైద్యం, సంక్షేమ పథకాలు, పాఠశాలల అభివృద్ధి, విద్యుత్ సమస్యల పరిష్కారం తదితరాలతో పల్లెలు ప్రగతి పథంలో సాగుతున్నాయి. ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగనున్న జెడ్పీ సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి పనులపై సభ్యులు చర్చించనున్నారు. 37 శాఖల ద్వారా ఇప్పటి వరకు సాగిన ప్రగతి, చేపట్టిన పనులు, ప్రజలకు ఒనగూరిన ప్రయోజనాలు, ఇకపై చేపట్టాల్సిన పనులపై సమావేశంలో చర్చలు సాగనున్నాయి. అభివృద్ధి పాలన అందించడానికి కృషి చేస్తున్నామని, నిధుల కేటాయింపుల్లో అన్ని రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. జెడ్పీ సర్వసభ్య సమావేశానికి ఏర్పాట్లు పూర్తి చేశామని, సభ్యులకు ముందస్తుగా సమాచారం అజెండా పుస్తకాలను అందజేశామని జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి చెప్పారు.

ఖాతాల్లో నగదు మాయంపై అధికారుల విచారణ



పొడగట్లపల్లిలో విచారణ చేస్తున్న ఆర్‌డీఓ ముక్కంటి, డీఎస్పీ రమణ తదితరులు

రావులపాలెం: బ్యాంకు ఖాతాల్లో తమ ప్రమేయం లేకుండా నగదు మాయమవుతోంది. నాలుగు రోజులుగా మండలంలో పలువురు ఖాతాల్లో ఈ విధంగా నగదు మాయమవడంపై శుక్రవారం 'సాక్షి'లో 'ఖాతాలో నగదు మాయం' శీర్షిక కథనం రావడంతో అధికారులు స్పందించారు. మండలంలోని పొడగట్లపల్లి గ్రామానికి చెందిన పోలవరపు శ్రీను ఖాతాలో నగదు మాయం కావడంతో శుక్రవారం అధికారులు విచారణ చేసి పలు అంశాలు పరిశీలించారు. ఆర్‌డీఓ ఎం.ముక్కంటి, ముఖ్య ప్రణాళిక అధికారి పి.వెంకటేశ్వర్లు, డీఎస్పీ కేవీ రమణ, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ పొడగట్లపల్లి వెళ్లి విచారణ చేశారు. అయితే కులగణన సర్వే కోసం సేకరించిన సమాచారానికి ఈ ఘటనకు ఏ విధమైన సంబంధం లేదని విచారణలో తేలిందని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఎట్టకేలకు మూడు కేసులు నమోదు చేసిన పోలీసులు

పలువురు ఫిర్యాదు చేసినా రెండు రోజులుగా పట్టించుకోని పోలీసులు, ఉన్నతాధికారుల విచారణతో శుక్రవారం మూడు కేసులు నమోదు చేశారు. రావులపాలెంకు చెందిన వెలగల రామేశ్వర్ రెడ్డి, పొడగట్లపల్లికి చెందిన పోలవరపు శ్రీనివాస్, ఈతకోటకు చెందిన మానే ప్రసాదులు ఇచ్చిన ఫిర్యాదు పై కేసులు నమోదు చేసినట్టు హెచ్‌సీ వైకుంఠరావు తెలిపారు. అలాగే ఎం.ఆధార్‌ను ప్రజలు లాక్ చేసుకోవాలన్నారు.